సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



ముంచంగిపుట్టు: ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో డుడుమ జలపాతం పరవళ్లు తొక్కుతోంది. జలవిద్యుత్ కేంద్రాలకు నీరందించే డుడుమ, జోలాపుట్టు జలాశయాల వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. సుమారు 2,800 అడుగుల ఎత్తునుంచి జాలువారుతుండటంతో ఆవరిస్తున్న తేమ మంచు సోయగాలను తలపిస్తోంది. టీపీ డ్యామ్ నుంచి కొంతదూరం కాలినడకన వెళ్తే ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించవచ్చు. అయితే ప్రస్తుతం ఈ మార్గం తుప్పలతో అలుముకుని ఉంది.

న్యూస్‌రీల్

భానుడు భగభగ



చెట్టు నీడను ఆశ్రయించిన సంతకు వచ్చిన గిరిజనులు

సాక్షి,పాడేరు: వారం రోజుల నుంచి భారీ వర్షాలు నెలకొన్న నేపథ్యంలో గురువారం వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. ఏజెన్సీ వ్యాప్తంగా అన్ని చోట్ల భానుడు చుర్రుమనిపించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జి.మాడుగుల మండలం మారుమూల మద్దిగరువు సంతకు వచ్చిన గిరిజనులు గొడుగులు, చెట్ల నీడను ఆశ్రయించారు.

పునరావాస కేంద్రాల సందర్శన



శబరికొత్తగూడెం పునరావాస కేంద్రంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

కూనవరం: మండలంలోని శబరికొత్తగూడెం, చినార్కూరు, కోతులగుట్టలోని పునరావాస కేంద్రాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్ గురువారం సందర్శించారు. శబరికొత్తగూడెం పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని వారు పరిశీలించారు. నిత్యావసర వసువుల పంపిణీని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఒడిశా నుంచి కూలిపనులకు వచ్చిన పది కుటుంబాలకు నిత్యావసరాలు అందజేయాలని సూచించారు. అనంతరం కోతులగుట్టలో వరద బాధితులతో మాట్లాడారు.డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, తహసీల్దార్ నాగబాబు, ఎంపీడీవో లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అడ్డతీగల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సున్నం రాజేంద్రస్వామి తెలిపారు. జువాలజీ, కామర్స్, ఫిజిక్స్ పోస్టులకు ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సంబంధిత సబ్జెక్ట్ పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుదారులు ఈనెల 18న కళాశాలలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు గంటకు రూ.150 చొప్పున లేదా గరిష్టంగా నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం చెల్లిస్తారని ఆయన తెలిపారు.

ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కిరణ్

చింతూరు: గోదావరి, శబరి వరదల ముంపు ప్రాంతాల్లో మంత్రుల బృందం పర్యటించి బాధితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం చింతూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సంభవించిన వరుస వరదలకు నాలుగు మండలాల్లోని సామాన్య ప్రజలతో పాటు రైతులు తీవ్రంగా నష్టపోయారని, మంత్రుల బృందం పర్యటించి వారికి సాయం అందించాలని కోరారు. నష్టపోయిన రైతులకు వరికి రూ.10 వేలు, పత్తి, మిరపకు రూ.30 వేలు, ఇళ్లు కూలిన వారికి రూ.3 లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి సీసం సురేష్, పల్లపు వెంకట్, రాజయ్య, నందా, కిట్టయ్య, కౌసల్య, రామయ్య పాల్గొన్నారు.

అరుణవర్ణ శోభితం



సూర్యాస్తమయం వేళ ఎంతో నిర్మలంగా ఉండే వినీలాకాశం ఒక్కసారిగా ఎర్రబడింది. రాజవొమ్మంగి ప్రాంతంలో గురువారం సాయంత్రం అరుణవర్ణంలోకి మారి కనువిందు చేసింది. ప్రకృతి ప్రేమికులు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకించారు.

– రాజవొమ్మంగి

వైద్య విద్య.. ఇక మిథ్య



జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాల నెలకొల్పి వైద్య విద్యను సామాన్యులకు సైతం అందుబాటులోకి తేవాలన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి గండి కొట్టారు.. అందనంత దూరంలో ఉండే మెడికల్ కాలేజీ తమ చెంతకే వస్తుందని సంబరపడ్డ విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లారు.. అనుబంధంగా నెలకొల్పే బోధనాస్పత్రి ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుందని ఆశించిన రోగులకు నిరాశ మిగిల్చారు.. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న ఒకే ఒక్క కారణానికి వైద్య విద్యను మిథ్యగా మార్చారు.

- విద్యార్థుల ఆశలపై 'కూటమి' నీళ్లు
- నర్సీపట్నం మెడికల్ కళాశాలపై ప్రై'వేటు'
- ఈ కాలేజీ నిర్వహణను పీపీపీ విధానంలో చేపట్టే యోచన
- పాడేరు మెడికల్ కాలేజీ సీట్ల సంఖ్య 150 నుంచి 50కు తగ్గింపు
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు





మాకవరపాలెం: భీమబోయినపాలెంలో 50 శాతానికి పైగా పూర్తయిన వైద్య కళాశాల భవనాలు

సాక్షి, అనకాపల్లి/సాక్షి, పాడేరు: వందేళ్ల తర్వాత వచ్చిన మహదవకాశమది.. అవకాశవాద రాజకీయాలకు చేజారిపోయింది.. నర్సీపట్నం నియోజకవర్గంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుడితే.. దానికి ఎగనామం పెట్టే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. పాడేరు మెడికల్ కాలేజీలో సీట్ల సంఖ్యను 150 నుంచి 50కి కుదించి విద్యార్థులకు అన్యాయం చేసింది. రానున్న 2025–26 విద్యా సంవత్సరంలో ప్రారంభించాలని నిర్ణయించిన ఏడు మెడికల్ కళాశాలల్లో ఒక పిడుగురాళ్ల మినహా మిగిలిన 6 (పార్వతీపురం, అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం, పెనుకొండ, పాలకొల్లు) వైద్య కళాశాలల్లో ప్రభుత్వపరంగా ప్రవేశాలు జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలకు అనుగుణంగా పీపీపీ విధానంలో నిర్వహణకు ప్రముఖ సంస్థలు ముందు కొస్తే వాటికి కళాశాలల నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని, చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు సూచించింది. ఇదే జరిగితే నర్సీపట్నం మెడికల్ కళాశాల ప్రైవేట్ వైద్య కళాశాలగా మారడం ఖాయం. భారీ ఫీజు చెల్లిస్తే కానీ సీటు దొరకదు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 1923లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. వందేళ్ల తర్వాత ఇదే ప్రాంతంలో అనకాపల్లి, పాడేరు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాడేరు కాలేజీని పూర్తి చేసింది. అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలంలో కూడా దాదాపు 50 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో 52.15 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసి గ్రామీణ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని గత ప్రభుత్వం సంకల్పించింది. ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంతో అనకాపల్లి జిల్లాతో పాటు అల్లూరి జిల్లాలోని కొయ్యూరు, చింతపల్లి, జీకే వీధి మండలాల గిరిజనులకు సైతం అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. కాలేజీ పూర్తయితే ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో విద్యార్థులకు ప్రవేశం లభిస్తుంది. తర్వాత పీజీ వైద్య కోర్సులు వస్తాయి. పీజీ వైద్య విద్యార్థులు, వారికి వైద్య విద్య బోధించే ప్రొఫెసర్లు (నిపుణులైన వైద్యులు) అందుబాటులోకి వస్తారు.

విద్యార్థులకు అశనిపాతం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాడేరు మెడికల్ కళాశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు ఈ ఏడాది జనవరి నెలలోనే ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా సర్వజన ఆస్పత్రిలో 420 బెడ్‌లతో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు, 80 శాతం ఫ్యాకల్టీని అందుబాటులోకి తెచ్చింది. జాతీయ మెడికల్ కౌన్సిల్ పరిశీలన తరువాత మెడికల్ కళాశాలను ప్రారంభించాలని అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. అయితే జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం పరిశీలన జాప్యం అయ్యింది, సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరువాత జూన్ 24న జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం పాడేరు జిల్లా ఆస్పత్రిలోని సౌకర్యాలు, మెడికల్ నిర్మాణ కళాశాల భవన నిర్మాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. 150 సీట్లతో మెడికల్ కళాశాలకు అనుమతి వస్తుందని ఇక్కడ వైద్యబృందాలు ఆశించాయి. కానీ 50 సీట్లతో మెడికల్ కళాశాల అడ్మిషన్లకు జాతీయ మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇచ్చింది.



భీమబోయినపాలెం (మాకవరపాలెం)లో నిర్మిస్తున్న వైద్య కళాశాల నమూనా చిత్రం

టీడీపీ అడ్డుపుల్ల

అనకాపల్లి జిల్లాలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయకుండా కూటమి పార్టీలు అడుగడుగునా అడ్డంకులు సృష్టించాయి. తొలి విడతలో అనకాపల్లి టౌన్‌లో ఏర్పాటుకు 50 ఎకరాల స్థలం కేటాయిస్తే..స్థానిక టీడీపీ నేతలు న్యాయస్థానాల ద్వారా అడ్డుకున్నారు. దీంతో నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలో గల భీమబోయినపాలంలో రూ.500 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కళాశాల నిర్మాణం ప్రారంభించింది. 50 శాతానికి పైగా పనులు పూర్తి చేసింది. ఇందులో బోధనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యాధునిక సౌకర్యాలు, నర్సింగ్ కాలేజ్, వసతి సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంది. ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్లకు తగ్గట్లుగా సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకూ అత్యాధునిక హంగులతో మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఇతర భవనాల నిర్మాణాలు జరిగాయి. 2025 నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో గత ప్రభుత్వం పనులు చేపట్టింది. కానీ ప్రభుత్వం మారగానే కూటమి ప్రభుత్వం పేదల కళాశాలను ప్రైవేట్ పరం చేసే యత్నం చేస్తోంది.

ధనికులకేనా డాక్టర్ చదువులు



వైద్యో నారాయణో హరి అంటారు. వైద్యుడిని దేవుడిలా ఆరాధిస్తారు. వైద్యరంగాన్ని ప్రైవేటుపరం చేస్తే పేదలెవరికైనా వైద్యం అందుతుందా. మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తే పేదలకు మెడికల్ సీట్లు, ఉద్యోగావకాశాలు ఎలా వస్తాయి. ప్రభుత్వ నిర్ణయం చూస్తే ధనికులకే మెడికల్ సీట్లు, డాక్టర్లు అవ్వాలన్న తీరు కనిపిస్తుంది. గత ప్రభుత్వం పేదల కోసం పని చేస్తే ఈ ప్రభుత్వం ధనికుల కోసం ఉన్నట్టు కనిపిస్తోంది. ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదు. నా కుమార్తె నీట్ రాసింది. ప్రభుత్వ తీరు వల్ల మాలాంటి వారి పిల్లలకు ఉద్యోగావకాశాలు దక్కేలా కనిపించడం లేదు.

– కోవెల జనార్ధనరావు, వడ్డాది, బుచ్చెయ్యపేట మండలం

ప్రై'వేటు' వేయకండి



మాకవరపాలెం వద్ద నిర్మిస్తున్న వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలి. దీన్ని ప్రైవేటు పరం చేయాలని ప్రభుత్వం యోచించడం సమంజసం కాదు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా మెడికల్ సీట్లు వస్తాయని ఆశించాం. ఫీజులు తక్కువగా ఉంటాయి. సామాన్యులు సైతం వైద్య విద్యను అభ్యసించడానికి అవకాశం కలుగుతుంది. పైగా సూపర్ స్పెషాలిటీ వైద్యం పేదలకు అందుబాటులోకి వస్తుంది. దీన్ని ప్రైవేటుపరం చేయాలని చూడటం వల్ల వైద్య విద్య సామాన్యులకు మిథ్యే కానుంది. ప్రైవేటీకరణ యత్నాలు విరమించుకోవాలి.

– వై.గణేష్, ఇంటర్మీడియట్ బైపీసీ విద్యార్థి, కశింకోట

చాలా బాధాకరం



ఎంబీబీఎస్ చదవడం ఎంతో మంది కల. రాష్ట్రంలో అరకొరగా ఉన్న మెడికల్ సీట్లతో వైద్య విద్య ఉన్నత వర్గాలకే పరిమితమైంది. మధ్యతరగతి వారికి అందని ద్రాక్షగా మారింది. దీంతో చాలామంది మధ్య తరగతి పిల్లలు వైద్య విద్య కోసం.. ఎన్నో ఇబ్బందుల మధ్య విదేశాలకు వెళ్తున్నారు. గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీంతో సొంత రాష్ట్రంలో ఎంతోమందికి ఎంబీబీఎస్ చదివే అవకాశం వస్తుందని సంతోషపడ్డాం. దీనిని అడ్డుకుని ప్రైవేట్‌పరం చేసేలా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్టు వార్తలు వింటున్నాం. ఇది చాలా బాధాకరం.

– ఎ.ధనశ్రీ, వైద్య విద్యార్థిని, విశాఖ

కార్పొరేట్ సంస్థలకు మేలు



పేద ప్రజలకు మెరుగైన వైద్యం, ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో విద్య లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 కొత్త మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టింది. ఈ కళాశాలల నిర్మాణం పూర్తయితే అదనంగా 1,800 సీట్లు దక్కుతాయి. ఇప్పటికే ఐదు కళాశాలల్లో తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి మొత్తం మారిపోయింది. మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసి కార్పొరేట్ సంస్థలకు మేలు చేస్తున్నట్టు కనిపిస్తోంది. గత ప్రభుత్వం ప్రతిపాదించి.. నిర్మిస్తున్న మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడానికి వీలులేదు. అందరూ కలసి దీనిపై ఉద్యమించాలి.

– పిల్లా మిత్ర మేఘన, మధురవాడ, విశాఖ

ఆదుకుంటాం..అధైర్యపడొద్దు

- చత్రాపల్లి గిరిజనులకు కలెక్టర్ దినేష్‌కుమార్ భరోసా
- అందరికీ ఇళ్లు కట్టిస్తామని వెల్లడి



చత్రాపల్లిలో జరిగిన నష్టాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



సప్పర్ల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గూడెంకొత్తవీధి: కొండచరియలు విరిగిపడి నష్టపోయిన గిరిజనులందరినీ ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. భారీ వర్షాలకు గాలికొండ పంచాయతీ చత్రాపల్లి గ్రామంలో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో మహిళ ప్రాణాలు కోల్పోగా పలువురు గిరిజనులు గాయపడటం తెలిసిందే. ఈనేపథ్యంలో గురువారం గ్రామాన్ని సందర్శించిన ఆయన పరిస్థితిని పరిశీలించారు. అందరికీ అండగా ఉంటామని, ధైర్యం కోల్పోవద్దని భరోసా ఇచ్చారు. ఇళ్లదెబ్బతిన్న గిరిజనులకు ఆర్థికసాయం అందించారు. కొండ దిగువన గ్రామం ఉన్నందున ప్రకృతి విపత్తుల వల్ల ఎప్పటికైనా ప్రమాదమేనన్నారు. సప్పర్ల సమీపంలో రహదారిని ఆనుకుని గిరిజనులందరికీ ఇళ్లు కట్టించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పునరావాస కేంద్రాన్ని సందర్శించి వారికి ఆహారం, వసతి గురించి తెలుసుకున్నారు. అనంతరం సప్పర్లలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ పాపారావు, డిప్యూటీ తహసీల్దారు కుమారస్వామి పాల్గొన్నారు.

వంతెన సమస్య పరిష్కరించాలి

- అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర డిమాండ్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలితో కలిసి కోతకు గురైన ప్రాంతం పరిశీలన



కోతకు గురైన వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, సుభద్ర, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల ప్రజలు సరిహద్దు వంతెన లేక పడుతున్న రవాణా కష్టాలను వెంటనే పరిష్కరించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర డిమాండ్ చేశారు. గురువారం వారు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి కోతకు గురైన వంతెనను పరిశీలించారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రాజెక్ట్ డ్యామ్ పైనుంచి వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు. ఈ సమస్యపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, ఈ సమస్యను కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవోల దృష్టికి తీసుకువెళ్తామని స్థానికులకు వారు హామీ ఇచ్చారు.

రూ.10 లక్షల కేటాయింపు : రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేలా తాత్కాలిక వంతెన నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రకటించారు. ఎంపీపీ సీతమ్మ, వైస్‌ఎంపీపీ భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు పాల్గొన్నారు.

వరద తెచ్చిన కష్టం.. తీరని నష్టం



వీఆర్‌పురం మండలం వడ్డిగూడెంలో ఇప్పటికీ వరద ముంపులోనే ఉన్న ఇళ్లు




చట్టివద్ద జాతీయ రహదారిపై వరదనీటిలో ఇరుక్కున్న లారీ

గోదావరి, శబరి నదులు శాంతించినా ఇప్పటికీ పొలాలు, రహదారులు ముంపులోనే ఉన్నాయి. వీఆర్‌పురం మండలంలో శ్రీరామగిరి గ్రామాన్ని వరద నీరు వీడలేదు. ముంపు ప్రాంతాల బాధితులు ఇప్పుడిప్పుడే పునరావాస కేంద్రాల నుంచి గ్రామాలకు చేరుకుంటున్నారు. ఇళ్లలో చేరిన బురదను తొలగించేందుకు సిద్ధమవుతున్నారు.

8లో

బలిమెలకు తగ్గని వరద పోటు

కొనసాగుతున్న నీటి విడుదల



నిండు కుండలా గుంటవాడ జలాశయం



బలిమెల నుంచి విడుదల అవుతున్న నీరు

సీలేరు: ఆంధ్రా ఒడిశా సరిహద్దులోని బలిమెల జలాశయానికి గురువారం కూడా వరద తాకిడి తగ్గ లేదు. దీంతో అప్రమత్తమైన జెన్‌కో అధికారులు నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1516 అడుగులు కాగా బుధవారం నాటికి 1513 అడుగులు ఉంది. దీంతో దిగువ నున్న గుంటవాడ (సీలేరు) జలాశయానికి 20 వేల క్యూసెక్కులు అదే రోజునుంచి విడుదల చేస్తున్నా నీటిమట్టం ఏమాత్రం తగ్గ లేదు. మరో పక్క గుంటవాడ నీటిమట్టం బుధవారం అర్ధరాత్రికి ప్రమాదస్థాయికి చేరుకుంది. దీంతో ఒక గేటును ఎత్తి వరద నీటిని విడుదల చేసినప్పటికీ నీటి మట్టం పెరుగుతూనే ఉన్నందున గురువారం ఉదయం మరో ఐదు గేట్లను ఎత్తి 11 వేల కూసెక్కులు విడుదల చేస్తున్నారు. అయినప్పటికీ 1312 అడుగుల వద్ద నీటిమట్టం స్థిరంగా కొనసాగుతోంది. ఇలావుండగా సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో మూడు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి వినియోగించిన ఎనిమిది వేల క్యూసెక్కులను వదులుతున్నారు.

డొంకరాయిలో నాలుగు గేట్లు ఎత్తివేత

గుంటవాడ రిజర్వాయర్ వరద నీటిని విడుదల చేస్తుండటంతో డొంకరాయి జలాశయ నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరింది. దీంతో నాలుగు గేట్లను ఎత్తి 34 వేల క్యూసెక్కులను నేరుగా శబరి నదిలోకి విడుదల చేస్తున్నారు. దీంతో నీటిమట్టం 1030 అడుగులకు తగ్గినట్టు జెన్‌కో అధికార వర్గాలు తెలిపాయి.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సహకారం

- వాటి ఆర్థిక బలోపేతానికి చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్
- జిల్లావ్యాప్తంగా ఏర్పాటుకు ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటుచేస్తే వాటి ఆర్థిక బలోపేతానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. నాబార్డు ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తే అన్నివిధాలుగా సహకారం అందిస్తామన్నారు. సహజ సిద్ధమైన చిరుధాన్యాలు, ప్రకృతి సంపదను పరిరక్షించుకోవడంతో పాటు గిరిజన రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలన్నారు. రైతులకు ఎరువులతో పాటు యంత్రపరికరాలు, ఉపకరణాలను అందించాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించడం వల్ల ఆదాయం తగ్గిపోతుందన్నారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, మరమ్మతుల బాధ్యత రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అప్పగిస్తామని చెప్పారు. వారి సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి ప్రతి నెలా సమావేశాలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. నాబార్డు జిల్లా వికాస అధికారి రావూరి చక్రధర్ మాట్లాడుతూ జిల్లాలో 50 రైతు ఉత్పత్తి సంఘాలు ఉన్నాయన్నారు. వీటిని బ్యాంకులతో సమన్వయం చేసి రుణాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులంతా విత్తన సంపదను కాపాడుకోవాలని, విత్తన తయారీ నర్సరీలపై దృష్టి పెట్టాలన్నారు.కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలని, అరకు కాఫీ బ్రాండ్‌ను వినియోగించుకునేందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలన్నీ కేంద్ర కాఫీ బోర్డు వద్ద ఆథరైజ్డ్ యూజర్ ధ్రువపత్రాలు పొందాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన, వ్యవసాయాధికారులు రమేష్‌కుమార్‌రావు, ఎస్‌బీఎస్ నందు, స్పైసెస్ బోర్డు అధికారి కళ్యాణి, కాఫీ బోర్డు అధికారి దుర్గాభవాని పాల్గొన్నారు.

భద్రత లేని ప్రయాణం



ప్రయాణికులే తమ దేవుళ్లనే ఆర్టీసీ నినాదంపై ప్రస్తుత ప్రభుత్వం శీతకన్ను ప్రదర్శిస్తోంది. రోజురోజుకు ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వారి సంఖ్యకు అనుగుణంగా బస్సులను సమకూర్చలేకపోతోంది. గిరిజన ప్రాంతం ప్రత్యేక జిల్లాగా ఏర్పాటైనా ఇప్పటికీ మారుమూల గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేదు. జి.మాడుగుల–పెదబయలు మండలాల సరిహద్దు మద్దిగరువులో గురువారం జరిగిన వారపుసంతకు గిరిజనులు ప్రాణాలకు తెగించి ప్రైవేట్ జీపు టాప్‌పైన, వేలాడి ప్రయాణిస్తూ కనిపించారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులకు చెక్ పెట్టాలంటే ప్రజలకు అవసరమైన స్థాయిలో రవాణా సదుపాయం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, పాలకులపై ఉందని ఈ దృశ్యం మరోసారి గుర్తు చేస్తోంది.

– సాక్షి, పాడేరు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అడ్డతీగల: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్‌లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు కారణంగా శుక్రవారం మూడు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ యూసఫ్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వంతెనల నిర్మాణం పూర్తి చేయండి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



ఇంజనీరింగ్ అధికారులను ఆదేశిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పెదబయలు: వంతెనల నిర్మాణాలు వేగవంతం చేసి జనవరి నాటికి పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని మారుమూల ప్రాంతాల్లో పర్యటించారు.వంతెనల నిర్మాణ పనులను పరిశీలించారు. గిన్నెలకోట వంతెనకు ఎస్‌సీఏ పథకంలో రూ.1.40 కోట్లు మంజూరు చేశామని, త్వరిత గతిన నిర్మాణం పూర్తి చేసి జనవరి నెలలో ప్రారంభించాలని గిరిజన సంక్షేమశాఖ ఈఈని ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఈఈ కె. వేణుగోపాల్, ఎంపీడీవో విగ్గిన్స్, తహసీల్దార్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తులు

దుంబ్రిగుడ/అరకులోయ రూరల్/మారేడుమిల్లి: ఎస్ఎస్‌సీ జీడీ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఏఆర్, ఎస్ఎస్‌బీ, ఐటీబీపీ పలు విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైయిందని, ఈ అవకాశాన్ని అర్హులైన గిరిజన, యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని అరకులోయ, మారేడుమిల్లి సీఐలు హిమగిరి, గోపాలకృష్ణ, దుంబ్రిగుడ ఎస్ఐ సంతోష్‌కుమార్‌లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఉచిత శిక్షణను కల్పిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి అర్హతతో నిర్వహించే ఆద్యోగాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పురుషులకు 162.5 సెంటిమీటర్లు ఎత్తు, స్త్రీలకు 150 సెంటిమీటర్లు ఎత్తులో ఉన్న వారు వచ్చే నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 నుంచి 23 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు మాత్రమే అర్హులన్నారు. ఎస్టీ, ఎస్సీలకు ఐదు సంవత్సరాలు మినహాయింపు ఉంటుందన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈ నెల 27 తేది వరకు ఉంటుందన్నారు. ఐటీడీఏ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అర్హులైన వారికి ఉచిత శిక్షణ, వసతి భోజనం కల్పిస్తున్నామని పూర్తి వివరాలకు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.



చింతూరు మండలం చట్టిలో జాతీయ రహదారిపై నిలిచి ఉన్న వరదనీరు



ధర్మతాళ్లగూడెంలో వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న పీవో అపూర్వభరత్, సబ్ కలెక్టర కల్పశ్రీ



టేకులబోరులో జలదీక్ష చేస్తున్న వరద బాధితులు

వరద తెచ్చిన కష్టం.. తీరని నష్టం

చింతూరు: గోదావరి, శబరినదుల నీటిమట్టాలు గురువారానికి మరింత తగ్గుముఖం పట్టాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం రాత్రికి 41 అడుగులకు తగ్గడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. రహదారులపై మాత్రం ఇంకా వరదనీరు నిలిచే ఉంది.

- వరదలకు చింతూరు మండలంలో 842 హెక్టార్లలో, కూనవరం మండలంలో 185 హెక్టార్లలో, వీఆర్‌పురం మండలంలో 140 హెక్టార్లలో వరిపంటలు నీటమునిగాయి.
- వీఆర్‌పురం మండలం శ్రీరామగిరి, 15 రహదారులు వరద ముంపులోనే ఉన్నట్టు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు.వరద ప్రభావిత గ్రామాల్లో నిత్యావసరాలు, పాలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.
- చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ గురువారం వీఆర్‌పురం మండలం ధర్మతాళ్లగూడెంలో వరద బాధితులకు నిత్యావసర సరకులు అందజేశారు. అనంతరం రేఖపల్లి పీహెచ్‌సీని సందర్శించిన వారు సిబ్బందికి పలు సూచనలు చేశారు.
- చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా గురువారం చట్టిలో జాతీయ రహదారి–30పై నిలిచివున్న వరదను పరిశీలించారు. పూర్తిగా తగ్గేవరకు రాకపోకలు సాగించవద్దని లారీడ్రైవర్లకు సూచించారు.



వీఆర్ పురం మండలం వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ మధ్య వరదనీటిలో రాకపోకలు



చింతూరు మండలంలో ముంపునకు గురైన వరి పంట

- చింతూరులో శబరి నీటిమట్టం 45 అడుగుల నుంచి గురువారం రాత్రికి 39 అడుగులకు తగ్గింది.
- కుయిగూరు వాగు వరదనీరు జాతీయ రహదారి–326పై నిలిచి ఉండటంతో ఆంధ్రా నుంచి ఒడిశాకు రాకపోకలు ప్రారంభం కాలేదు. వీరాపురం వద్ద జాతీయ రహదారి–30పై వరద నీరు తగ్గడంతో ఛత్తీస్‌గఢ్‌కు రాకపోకలు మొదలయ్యాయి. చట్టివద్ద నీరు ఉన్నందున తెలంగాణకు రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. ఇదే ప్రాంతంలో వరదనీరు దాటేందుకు ప్రయత్నించిన లారీ వరదనీటిలో చిక్కుకుంది.
- సోకిలేరు, కుయిగూరు, చంద్రవంక, జల్లివారిగూడెం, చీకటివాగుల వరద వల్ల చింతూరు నుంచి కూనవరం, వీఆర్‌పురం మండలాలకు, చింతూరు మండలంలో 25 గ్రామాలకు గురువారం కూడా రాకపోకలు ప్రారంభం కాలేదు. జాతీయ రహదారిపై వరదనీరు తగ్గకపోవడంతో వందలాది లారీలు చట్టి జంక్షన్ వద్ద నిలిచిపోయాయి. ఆహారం, నీళ్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని లారీడ్రైవర్లు వాపోయారు.

పోలవరం ప్యాకేజీ ఇచ్చి పంపించండి

కూనవరం: ఏటేటా వచ్చే గోదావరి వరదలతో సర్వం కోల్పోతున్నామని, ఈబాధలు భరించడం మావల్లకాదని, తక్షణం పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి ఇచ్చి పంపించండి మహాప్రభో అంటూ టేకులబోరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం వారు సినిమాహాల్ సెంటర్‌లో జలదీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రకాల సర్వేలు పూర్తి అయ్యాయని, స్ట్రక్చర్ విలువ అంచనా ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. నష్టపరిహారం ఎంత త్వరగా ఇస్తే మేము ఈబాధల నుంచి గట్టెక్కుతామని వారు పేర్కొన్నారు.

గిరిజన మత్స్యకార రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు



గిరిజన రైతులకు చేప పిల్లలు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలోని మత్స్యకార రైతులను ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తగు చర్యలు తీసుకుంటామని, రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. గురువారం మండలంలోని పందిరిమామిడి కోట కృషి విజ్ఞాన కేంద్రంలో చేపట్టాన గిరిజన మత్స్యకార రైతులకు చేప పిల్లలు పంపిణీ కార్యక్రమానికి పీవో ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చేపల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి మత్స్య సంపద అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రంపచోడవరం నియోజకర్గం ఏడు మండలాల్లో 100 మంది రైతులకు 100 ఎకరాల్లో చేపలు పెంచే విధంగా ఒక్కోక్క చేప పిల్ల రెండు రుపాయలు చొప్పున రైతులకు అందజేయనున్నట్టు చెప్పారు. ఈ ఏడాది రెండు లక్షల చేప పిల్లలు రైతులకు పంపిణీ చేయడానికి సిద్ధం చేశామన్నారు. అదే విధంగా వచ్చే ఏడాది ఐదు లక్షలకు చేప పిల్లలను పెంచి రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏజెన్సీలో రైతులు పెంచిన చేపలను ఇతర ప్రాంతాలకు సరఫరా కూడా చేస్తామన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. రైతులు శ్రద్ధగా చేప పిల్లను పెంచి మంచి అదాయం ఆర్జించాలని కొరారు. శాస్త్రవేత్త కె.వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- బాల బాలికలకు వేర్వేరుగా భోజనాలు అందించాలి
- జోలాపుట్టు పాఠశాల వసతి గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్రలు.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు



బొంద్రుగూడలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: బాలబాలికలకు వేరువేరుగా భోజనాలు అందించాలని జోలాపుట్టు పాఠశాల వసతి గృహ నిర్వాహకులకు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలు సూచించారు.గురువారం జోలాపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీలు సందర్శించారు. విద్యార్థులకు, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికలకు ఒకే దగ్గర ప్రతి రోజు భోజనాలు అందిస్తుండడం సరికాదని, వేరువేరుగా భోజనాలు అందించాలని హెచ్ఎం నిర్మలకు సూచించారు. శిథిలమైన పాఠశాల భవనాలను కూలివేయాలని, అందులో హస్టల్ నిర్వహణ చేయవద్దని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్రలు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలలో బాలికలు, బాలురులకు ఒకే దగ్గర హస్టల్ నిర్వహించడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకువచ్చారని, కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటిడిఏ పివో అభిషేక్‌తో మాట్లాడి బాలికలు,బాలురకు వేరువేరుగా హస్టల్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని వారు అన్నారు. ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, మండల పార్టీ అధ్యక్షులు పద్మారావు తదితరులున్నారు. అంతకుముందు వారు జోలాపుట్టు జలాశయ్యాన్ని సందర్శించారు. ప్రాజెక్టులో నీటి స్థాయి, విడుదలపై ఈఈ ప్రధాన్, ఏఈ రాయ్‌లను అడిగి తెలుసుకున్నారు. నీటి విడుదల సమయంలో వాగులు, గెడ్డల పరివాహక గ్రామాలకు ముందుస్తుగానే అప్రమత్తం చేయాలని వారు కోరారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

జోలాపుట్టు పంచాయతీ పోలిపుట్టు, బొంద్రుగూడ గ్రామాల్లో జెడ్పీ నిధులు రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు గురువారం జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కోట్టగుళ్లి భాగ్యలక్ష్మి తదితరులు శంకుస్థాపనలు చేశారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్థానికులు ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌లకు పూలమాలలు వేసి, కృతజ్ఞతలు తెలిపారు. అయ్యప్ప పీఠంలో జెడ్పీ నిధులతో బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అనుమానాస్పద స్థితిలో క్లీనర్ మృతి



లారీ లోడు పైభాగంలో క్లీనర్ మృతదేహం

చింతూరు: లారీ క్లీనర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన లారీ పసుపు లోడుతో ఛత్తీస్‌గఢ్‌లో రాయ్‌పూర్ మూడు రోజుల క్రితం బయలుదేరింది. ఈ క్రమంలో మండలంలోని మండలం సింగన్నగూడెం వద్దకు వచ్చేసరికి జాతీయ రహదారి–30పై వరదనీరు నిలిచి ఉంది. వెంటనే డ్రైవర్ లారీని రోడ్డు పక్కన నిలిపివేశాడు. వరద ప్రవాహం తగ్గకపోవడంతో డ్రైవర్, క్లీనర్ అక్కడే గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి డ్రైవర్ సుభాని క్యాబిన్‌లో నిద్రపోగా, క్లీనర్ లోడ్ పైకి ఎక్కి నిద్రపోయాడు. గురువారం ఉదయం నిద్రలేచిన డ్రైవర్, క్లీనర్‌ను ఎంత పిలిచినా లేవక పోవడంతో లోడు పైకి ఎక్కి చూడగా మృతి చెంది ఉన్నాడు. ఈ విషయాన్ని పక్కనే ఉన్న వాహనాల డ్రైవర్లు, యజమానికి డ్రైవర్ చెప్పినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. అతని ఫిర్యాదు మేరకు క్లీనర్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 30 సంవత్సరాలు ఉంటాయని, మహారాష్ట్రకు చెందినవాడుగా డ్రైవర్ చెబుతున్నాడని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఆయన వివరించారు. అయితే మృతుడు చేతిపై కిట్టూ అని ఉన్నందున అతని పేరు కూడా అదే కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

- రసాయక ఎరువులు వాడొద్దు
- జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్



రైతులకు సూచనలిస్తున్న జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్, విజయలక్ష్మి

పెదబయలు: రైతులు పండిస్తున్న పంటలకు సస్యరక్షణ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత డాక్టర్ ప్రదీప్‌కుమార్, జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు ఎం.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని గంపరాయి గ్రామ సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ జాతీయ ఆహార భద్రత పథకం వేరుశనగ కదిరి లేపాక్షి రకం సాగుపై జాగ్రత్తలు తీసుకోవాలని రైతులను వివరించారు. గలగండ గ్రామంలో రాగి ప్రదర్శన కేంద్రం రైతులతో సమీక్ష నిర్వహించారు. రైతులు నాటిన రాగుల పంటను పరిశీలించారు. 25 సెంటి మీటర్లు యడంలో నాటితే పంటల మధ్యలో అంతర కృషి వలన రెట్టింపు దిగుబడి ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల రాగులు దిగుబడి సాధించే అవకాశం ఉందని సూచించారు. రసాయన ఎరువులు, జీవన ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలకు వివరించారు.ఈ కార్యక్రమానికి రైతు సహాయ కేంద్రం సహాయకులు జానకిరాం,గలగండ,గంపరాయి రైతులు పాల్గొన్నారు.

కాఫీ సాగులో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న కాఫీ బోర్డు ఇన్‌చార్జి డీడీ రమేష్

చింతపల్లి: కాఫీసాగులో గిరిజన రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని కేంద్ర కాఫీబోర్డు ఇన్‌చార్జి డీడీ రమేష్ సూచించారు. గురువారం పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో చింతపల్లిలో మూడు మండలాల జీసీసీ, కాఫీ ఐటీడీఏ, కాఫీబోర్డు అధికారులు, ఉద్యోగులు, కాఫీరైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో కాఫీ సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతున్నా అందుకు తగ్గట్టుగా నాణ్యత, దిగుబడులు పెరగడం లేదన్నారు. నాణ్యతపైనే దేశ విదేశాలకు ఎగుమతి అయ్యే కాఫీ ఆధారపడి ఉంటుందన్నారు. రైతులు వ్యాపారులకు అమ్మినా జీసీసీకి అమ్మినా కాఫీలో నాణ్యత ఉండేలా చూసుకోవాలన్నారు. నాణ్యతతో ఉన్న కాఫీకి ఈఏడాది గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు ప్రత్యేకంగా మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్టు ఐటీడీఏ కాఫీ విభాగం ఏడీ అశోక్ తెలిపారు. జీసీసీ, ఐటీడీఏ, కాఫీబోర్డు ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. చింతపల్లిలో గిరిజన రైతులతో ఏర్పాటైన మాక్స్ ద్వారా ఈ ఏడాది 3వేల మెట్రిక్‌టన్నుల కాఫీ సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో గ్రామాల వారీగా కాఫీ రైతులతో అవగాహన కల్పిస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక షెడ్యూలు రూపొందించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డీఎం దేవరాజ్, మాక్స్ అధ్యక్షుడు సెగ్గె కొండలరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు చిట్టి చేతుల సాయం

- మోదమాంబ హైస్కూల్ విద్యార్థులు రూ.లక్ష విరాళం



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు రూ.లక్ష నగదును అందిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సాక్షి,పాడేరు: వరద బాధితుల సహాయార్థం స్థానిక మోదమాంబ హైస్కూల్ విద్యార్థులు రూ.లక్ష విరాళాన్ని గురువారం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అందజేశారు. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి పంపాలని వారు కోరారు. విద్యార్థులంతా పెద్ద మొత్తంలో సాయం అందించడంతో యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ గమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారులు అస్తవ్యస్తం...పట్టించుకోని యంత్రాంగం



అస్తవ్యస్తంగా మారిన పిల్లిగెడ్డ వంతెన



ఘాట్‌రోడ్డులో కొనసాగుతున్న సహాయక చర్యలు

సీలేరు: తుపాను వల్ల కురిసిన వర్షాలకు జిల్లా అంతరాష్ట్ర రహదారితో పాటు మారుమూల గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. ఈ మార్గంలో భారీ ఎత్తున కొండచరియలు పడడంతో వంతెనలు, రోడ్లు, కొట్టుకుపోయి నేటికి ఆరు రోజులు గడుస్తున్నా పునరుద్ధరణ పనులు నత్తనడకగా జరుగుతున్నాయని స్థానికులు, గిరిజన సంఘ నేతలు చెబుతున్నారు. జి.కె.వీధి మండల కేంద్రం నుంచి సీలేరు వరకు పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడి రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయినా నాలుగు పొక్లెయిన్‌లతో పనులు చేయిస్తున్నారని, సీలేరు నుంచి ఐస్‌గెడ్డ జలపాతం వరకు పదిచోట్ల నేటికి కొండచరియలు తొలగించ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీలేరు నుంచి ఒడిశాకు వెళ్లే అంతరాష్ట్ర రహదారి అగ్రహారం వంతెన, పిల్లిగెడ్డ వంతెనలు వరద భీభత్సానికి కొట్టుకుపోయాయని చెబుతున్నారు. చట్రాపల్లికి మినహా మరే గ్రామానికి ఇప్పటివరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి త్వరితగతిన సహాయక చర్యలు చేపట్టి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

బాలిక మృతదేహానికి పోస్టుమార్టం



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారామ్, ఎంపీడీవో మేరీరోజ్

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల పంచాయతీ గోధుమలంక గ్రామానికి చెందిన దివ్యాంగ బాలిక పాంగి హిందుజ సమీప కాలువలో పడి బుధవారం మృతి చెందింది. ఈ సంఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో మేరీరోజ్, తహసీల్దార్ సీతారామ్‌లు గురువారం గ్రామాన్ని సందర్శించారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం బాలిక మృతదేహానికి చింతపల్లి నుంచి వచ్చిన వైద్యులు, సిబ్బంది ద్వారా పోస్టుమార్టం చేయించారు. వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా సాయం అందేలా కృషి చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

చురుగ్గా విద్యుదుత్పత్తి పునరుద్ధరణ పనులు



మాచ్‌ఖండ్ ప్రాజెక్టులో జరుగుతున్న మరమ్మతులు



మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి పునరుద్ధరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ కేంద్రంలో ఇటీవల నీరు చేరి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడం తెలిసిందే. దీనిపై స్పందించిన ప్రాజెక్టు ఎస్ఈ ఏవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు వారం రోజుల్లో విద్యుదుత్పత్తి ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టారు. ఒడిశాలోని కోరాపుట్టు జిల్లా లంతాపుట్టుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు.

మరమ్మతు పనులపై పీవో ఆరా : మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని గురువారం పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సందర్శించారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, మాచ్‌ఖండ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరావులతో కలిసి మాచ్‌ఖండ్ పరిస్థితులు, జోలాపుట్టు, డుడుమ జలాశయాల నీటి మట్టాలపై చర్చించారు. విద్యుత్ ఉత్పాదన పునరుద్ధరణకు తీసుకుంటున్న చర్యలను పీవో తెలుసుకున్నారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్, డీటీ అప్పలస్వామి, ఆర్ఐ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

పశుసంపదకు నష్ట పరిహారం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ నర్సింహులు

చింతపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో పశుసంపదను నష్టపోయిన గిరిజన రైతులకు ప్రభుత్వ పరంగా పరిహారం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ నర్సింహులు తెలిపారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల పశుసంవర్ధకశాఖ వైద్యాధికారులు, సిబ్బందితో డివిజన్ స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. చింతపల్లి ఏడీ చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఇప్పటి వరకూ 20 పశువులు, 97 మేకలు, గొర్రెలు, 120 కోళ్లు చనిపోయినట్టు తమ వద్ద సమాచారం ఉందన్నారు. వీటి విలువ రూ.11లక్షలు ఉంటుందని తెలిపారు. కొండ చరియలు విరిగిపడిన ప్రమాదంలో గూడెంకొత్తవీధి మండలం చట్రాపల్లిలోనూ పశువులు ప్రాణాలు కోల్పోయినట్టు తెలిపారు. దీనిపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈనెల 21నుంచి పశుగణన చేపడతామన్నారు. పశువైద్యాధికారులు దమయంతి, దుర్గాప్రసాద్, చల్లంగి షాలిని పాల్గొన్నారు.